క్లుప్తంగా

జాతీయ స్కేటింగ్ పోటీలకు ఎంపిక



గుడివాడ టౌన్: జాతీయ స్కేటింగ్ పోటీలకు తమ విద్యార్థి అర్హత సాధించినట్లు కేకేఆర్ గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ పీ లక్ష్మీ ప్రసాద్ శనివారం తెలిపారు. ఈనెల 1 నుంచి 4వ తేదీ వరకు తణుకులో జరిగిన 35వ రాష్ట్ర అంతర్ జిల్లా రోలింగ్ హాకీ చాంపియన్‌షిప్ పోటీలో పాల్గొన్న తమ విద్యార్థి జి.శ్రీమంత్ జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాడని ఆయన వివరించారు. డిసెంబరు 10 నుంచి 14వ తేదీ వరకు చండీఘర్‌లో జరిగే 61వ జాతీయ రోలింగ్ హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీమంత్ పాల్గొనడానికి అర్హత సాధించాడన్నారు. క్రీడాకారుని, కోచ్ పీఎస్‌వీఎస్ అయ్యప్పను అభినందించారు.

దివ్యాంగురాలికి సాయం



పులిగడ్డ(అవనిగడ్డ): పులిగడ్డ బీసీ కాలనీకి చెందిన దివ్యాంగురాలు నాగిడి శివగంగకు శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాం కిశోర్‌నాయుడు రూ.7 వేలు ఆర్థిక సహాయం అందించారు. గత కొద్ది రోజుల నుంచి మెడ నరాల వ్యాధితో ఆమె బాధపడుతూ లేవలేని స్థితిలో ఉంది. కార్యక్రమంలో పాస్టర్ విలియం కేరీ, నాగిడి శివ, రాంబాబు, తమ్మా సురేష్ పాల్గొన్నారు.

14 నుంచి కార్తిక మాసోత్సవాలు

నాగాయలంక: స్థానిక నగరేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 14వ తేదీ నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు కార్తిక మాసోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు శనివారం తెలిపారు. నిత్యం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, మట్టి శివలింగాలతో సామూహిక పూజలు, అఖండ కర్పూర జ్యోతి వంటి ఆధ్యాత్మిక విశేష పూజలు, కార్తిక అన్నసంతర్పణలు, వన సమారాధనలు నిర్వహింస్తామని చెప్పారు. స్థానిక శ్రీరామ పాదక్షేత్రం ఘాట్ వద్ద కృష్ణానదిలోని రామలింగేశ్వర స్వామి మండపంలో నెల రోజుల పాటు స్వామి వారికి నిత్య నవ హారతులు, ప్రతి సోమవారం భక్తులకు కార్తిక భోజనాలు, ప్రత్యేక ఆధ్యాత్మిక పూజలు నిర్వహిస్తామని క్షేత్రం చైర్మన్ లయన్ ఆలూరి శ్రీనివాసరావు తెలిపారు.

గో గ్రీన్ దీపావళి అవగాహన ర్యాలీ



పెనమలూరు: కాలుష్య రహిత దీపావళి చేసుకోవాలని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తెలిపారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ఎన్ఎస్ఎస్, ఎకో క్లబ్ ఆధ్వర్యంలో గో గ్రీన్ దీపావళి పేరుతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ బాణసంచా కాల్చటం వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. మందుగుండు సామాను పేల్చటం వలన ప్రతికూల పరిస్థితులు ఏర్పడతాయని, ప్రమాదాలు కూడా జరుగుతాయన్నారు. గో గ్రీన్ దీపావళిలో భాగంగా సహజ సిద్ధంగా దీపావళి చేసుకోవాలని సూచించారు. మట్టి ప్రమిదలు వాడాలని, పూలతో ముగ్గులు వేయాలని కోరారు. ఆటపాటలతో దీపావళి సందడిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ అవసరం



కంకిపాడు: దోమల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ అవసరమని మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.శ్రీనివాసరావు అన్నారు. కంకిపాడు పట్టణంలో శనివారం దోమల నిర్మూలన ప్రత్యేక చర్యలు చేపట్టారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల విషయంలో అలసత్వం వహించొద్దని, అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఇంటినీ సందర్శించి దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

సంక్షేమం కావాలంటే వైఎస్సార్ సీపీ మళ్లీ రావాలి

- ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్
- భట్లపెనుమర్రులో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

భట్లపెనుమర్రు(మొవ్వ): అన్ని వర్గాలకు లబ్ధిచేకూరాలన్నా.. రాష్ట్ర ప్రజలకి సంక్షేమ ఫలితాలు నిష్పక్షపాతంగా అందాలన్నా వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని భట్లపెనుమర్రు గ్రామంలో శనివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు ఏ మేరకు లబ్ధి చేకూరిందో వివరించారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చిన ప్రతి సమస్యకు తక్షణ పరిష్కార దిశగా అధికారులకు సూచనలిస్తూ ముందుకు సాగారు. ముందుగా గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రకటించిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అందరి సంక్షేమం, అభ్యున్నతికై కృషి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వానికి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలు గమనించారన్నారు. వైఎస్సార్ సీపీని ఆశీర్వదించటానకి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో తెలుగుదేశం ప్రభుత్వం చేసిన అరాచకాలను ప్రజలు మరిచిపోలేదని గుర్తుచేశారు.

ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌ను ప్రజలు అంతర్గత రహదారులు కావాలని, డ్రెయిన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, సర్పంచ్ మట్టా ఇందిర, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయప్రసాద్, ఎంపీడీవో జి. సుధాప్రవీణ్, నాయకులు అంగడాల నగేష్, చలసాని వెంకటరత్నం, కొండమంచిలి నాంచారయ్య, పెనుమచ్చు యేసురత్నం, అంగడాల సుబ్బారావు, గొరిపర్తి వీర వెంకటేశ్వరమ్మ, షేక్ మస్తాన్‌వలి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, పంచాయతీ పాలకమండలి సభ్యులు, వలంటీర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వత్రా దీపావళి సందడి



కైకలూరులో టపాసుల దుకాణాలను ప్రారంభిస్తున్నఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



పామర్రులో దుకాణం వద్ద టపాసులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



విక్రయదారుకులకు సూచనలిస్తున్న సీఐ

పామర్రు: దీపావళి పండుగ సందర్భంగా సర్వత్రా సందడి వాతావరణం నెలకొంది. ఆదివారం దీపావళి పండుగను పురస్కరించుకుని శనివారం స్థానిక చల్లపల్లి రోడ్డులోని కోటి జగపతి కల్యాణ మండపంలో టపాసుల దుకాణాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం నుంచి టపాసుల దుకాణాల్లో అమ్మకాలు ఊపందుకున్నాయి. సెలవు దినం కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలతో దుకాణాలకు తరలివచ్చారు. పిల్లల కోరిన టపాసులను కొనుగోలు చేశారు. పండుగను ఏవిధమైన ఇబ్బందులు లేకుండా తగు విధమైన జాగ్రత్తలు పాటించి నిర్వహించుకోవాలని అగ్నిమాపక అధికారి రాంబాబు తెలిపారు. ఎటువంటి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడినా వెంటనే 08674 253120ను సంప్రదించాలని సూచించారు. పామర్రులో టపాసుల దుకాణాలను తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పరిశీలించి అనుమతులు ఇచ్చారు. గత ఏడాది కంటే ధరలు ఎక్కువగా ఉన్నాయని వినియోగదారులు కొందరు వాపోయారు.

మండవల్లి: మండలంలో దీపావళి సందర్భంగా 8 బాణసంచా షాపులకు అనుమతి ఇచ్చినట్లు తహసీల్దార్ సీకే వెంకటరమణ శనివారం పేర్కొన్నారు. మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6, ఉనికిలి-1, పెరికెగూడెం-1 షాపును నిర్వాహకులకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. దీపావళి షాపుల వద్ద ప్రశాంతంగా విక్రయాలు జరపాలన్నారు. అగ్ని ప్రమాదానికి కారణమయ్యే వస్తువులు దగ్గరలో ఉంచరాదన్నారు. నీరు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు.

కైకలూరు: దీపావళి సందర్భంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన 10 టపాసుల దుకాణాలను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ శనివారం ప్రారంభించారు. కొనుగోలుదారులు, విక్రయదారులు మందుగుండు సామగ్రి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, నాయకులు నిమ్మల సాయి, దండే రవిప్రకాష్ పాల్గొన్నారు.

టపాసుల దుకాణాల పరిశీలన

పెదపూడి(మొవ్వ): మండలంలోని పలు బాణ సంచా దుకాణాలను శనివారం సాయంత్రం కూచిపూడి ఎస్‌ఐ డీ సందీప్, పామర్రు సీఐ వి.సుభాకర్‌తో కలిసి పరిశీలించారు. విక్రయ దారులకు పలు సూచనలు చేశారు. పెదపూడిలోని వర్తక సంఘం కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన లైసెన్స్‌దారులతో సీఐ మాట్లాడారు. నిబంధనలు వివరించారు. దుకాణాల సమీపంలో టపాసులు కాల్చరాదని, అగ్ని ప్రమాదం జరిగితే మంటలు అదుపు చేసేందుకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

ఆటో డ్రైవర్లు ఐకమత్యంతో మెలగండి

ఎమ్మెల్యే డీఎన్నార్



కైకలూరు బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ఆటో డ్రైవర్లు అందరూ ఐకమత్యంతో మెలగాలని కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సూచించారు. కైకలూరు నియోజకవర్గం ఏలూరు జిల్లాలో విలీనంతో వివిధ ఆటో డ్రైవర్ల యూనియన్ల సభ్యులు ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి పలు అంశాలను శనివారం ప్రస్తావించారు. దీంతో ఆయన కైకలూరు బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్ల యూనియన్ కేంద్రాలను పరిశీలించారు. ఇప్పటి వరకు ముదినేపల్లి, ఏలూరు యూనియన్లలో భాగస్వాములుగా ఉంటున్నామని స్థానికలందరం నూతన యూనియన్‌ను ఏర్పాటు చేసుకుంటామని కొందరు డ్రైవర్లు చెప్పారు. దీంతో ఎమ్మెల్యే విడివిడిగా యూనియన్లు ఏర్పాటు చేసుకుని అందరూ కలసికట్టుగా పనిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, పల్లివాడ పీఏసీఎస్ అధ్యక్షుడు గంగుల అశోక్, నాయకులు నిమ్మల సాయి, దండే రవిప్రకాష్, ముదినేపల్లి, ఏలూరు ఆటో వర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

14న మండల సమావేశం

తోట్లవల్లూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 14న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తుంగల స్వర్ణలత తెలియజేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అధ్యక్షతన సమావేశం జరుగుతుంది. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారుల హాజరు ఆమె విజ్ఞప్తి చేశారు.

19 మద్యం బాటిళ్లు స్వాధీనం

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పి. విశ్వనాథ్ తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ సమీపంలో అక్రమ మద్యం విక్రయిస్తున్న ఆకునూరి శివశంకర్‌ను శనివారం అదుపులోకి తీసుకుని 19 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం

మండవల్లి: ప్రజాస్వామ్య పరిరక్షణే ఐక్య వేదిక లక్ష్యమని ఇందుకోసం అవగాహన కలిగిన వ్యక్తులను గుర్తించి వేదికలో చేర్చటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు పేర్కొన్నారు. స్థానిక స్టేషన్‌రోడ్‌లోని టైపు ఇన్స్టిట్యూట్‌లో ప్రజాస్వామ్య ఐక్య వేదిక మండల కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు టి. అప్పారావు అధ్యక్షతన శనివారం జరిగింది. భాస్కరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలైనా ప్రజాస్వామ్యంలో ప్రజలంతా అన్నింటిలో సమానంగా ఎదగలేకపోయారన్నారు. సమావేశంలో కె.మార్కు రాజు, జి. గణేష్, బి.దివాకర్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఈ నెల 14వ తేదీ నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు బాపులపాడు మండలం వీరవల్లి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోడెబోయిన బాబి, గ్రంథాలయ అధికారి పి.స్వర్ణలత తెలిపారు. ఈ సందర్భంగా శనివారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రంథాలయంలో ప్రతిరోజూ పలు ప్రత్యేక కార్యక్రమాలు, విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్‌టీఎఫ్ ఆర్థిక సాయం

వక్కలగడ్డ(చల్లపల్లి): గ్రామానికి చెందిన బొడ్డు సీతారామయ్య కుటుంబానికి నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ నాయకులు ఆర్థిక సాయం చేశారు. సీతారామయ్య శనివారం మృతి చెందగా, ఆయన భార్య యశోదకు ఎన్‌టీఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవరకొండ నాగలక్ష్మయ్య రూ.5 వేలు ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఎన్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుంభా లక్ష్మయ్య, సాంబయ్య, కట్టా ప్రసాద్ పాల్గొన్నారు.

అబుల్ కలాం సేవలు ఆదర్శనీయం



నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్, ఉద్యోగులు



బందరులో ఆజాద్ చిత్రపటం వద్ద నివాళి

గుడివాడ టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆజాద్ చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం స్వాతంత్ర్య సమరయోధుడిగా, రాజ్యాంగ రచనా కమిటీ సభ్యుడిగా, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జాతికి ఎన్నో సేవలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. పట్టణ ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో నేషనల్ ఎడ్యుకేషన్ డే నిర్వహించారు. అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వివిధ కేటగిరీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలైన 50 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బేసిక్ పబ్లిక్ స్కూల్ అధినేత తాజుద్దీన్, సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి, ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్ఎం అలీ, విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్ సేవలు చిరస్మరణీయం

మచిలీపట్నంటౌన్: స్వాతంత్ర్య సమర యోధుడు, విద్యావేత్త, సంఘ సంస్కర్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి చిరస్మరణీయమైన సేవలు అందించారని పలువురు వక్తలు అన్నారు. ఆజాద్ జయంతి కార్యక్రమం నగరంలోని పలు సంస్థల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముస్లిం చైతన్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక బీసీ సంఘ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆజాద్ చిత్ర పటానికి చైతన్య వేదిక సలహాదారు అహ్మద్ అలీ, బైరాగులపల్లి సినిమా దర్శకుడు జాన్ థామస్ పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఆజాద్ భారతదేశానికి తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేసి విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు. దేశంలో విభిన్న మతాలు, సంస్కృతులు ఉన్నప్పటికీ మనమంతా ఒక్కటేనంటూ హిందూ, ముస్లిం ఐక్యతకు ఆజాద్ కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు షేక్ అమీర్, ప్రధాన కార్యదర్శి ఎంపీ మునావర్, మచిలీపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు హసీంబేగ్, ప్రధాన కార్యదర్శి అబేద్‌అలీ, జిల్లా న్యాయ సలహాదారు ఎండీ మస్తాన్, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు కేవీవీ సత్యనారాయణ, మైనార్టీ నాయకులు షేక్ మౌలాలి, అబ్దుల్ అజీం, జైరుల్‌ఖాద్రీ, నూర్ తదితరులు పాల్గొన్నారు.

- నగరంలోని పుట్లమ్మ చెరువుల వద్ద ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి ఎలక్ట్రికల్ డివిజినల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం. భాస్కరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు.
- ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆజాద్ జయంతి కార్యక్రమం స్థానిక ఇనుగుదురుపేటలో ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండీ సద్రుద్దీన్ ఖురేషి పూలమాల వేసి నివాళులర్పించారు. సద్‌రుద్దీన్ మాట్లాడుతూ ఆజాద్ సేవలను కొనియాడారు. ఆజాద్ జీవితం నేటి యువతకు ఆదర్శమన్నారు.

బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి



ఫైర్ ఆఫీసర్ క్రాంతికుమార్

కైకలూరు: బాణసంచా కాల్చేటప్పుడు ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని కైకలూరు అగ్నిమాపక అధికారి కె.క్రాంతికుమార్ శనివారం చెప్పారు. దీపావళి పర్వదినం సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 25 బాణసంచా విక్రయ దుకాణాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రజలు లైసెన్సులు పొందిన దుకాణాల వద్ద మాత్రమే టపాసులు కొనుగోలు చేయాలని చెప్పారు. ఖాళీ ప్రదేశాల్లో కాల్చడం ఉత్తమమన్నారు. కాటన్ దుస్తులు, కాళ్లకు చెప్పులు ఖచ్చితంగా ధరించాలన్నారు. ప్రధానంగా బాంబులు కాల్చేటప్పుడు వాటి వద్దకు వెళ్లి పరీక్షించకూడదన్నారు. చేతులు పట్టుకుని కాల్చడం ప్రమాదకరమని సూచించారు. బాణసంచా విక్రయ దుకాణాల వద్ద డ్రమ్ములలో నీరు, ఇసుక బకెట్లు, ఫైర్ విషర్‌లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. బాణసంచా దుకాణాల మధ్య కనీసం 3 మీటర్ల దూరం ఉండాలని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని కోరారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన డీఎంహెచ్‌వో



గురుకుల పాఠశాలలో మెస్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీతాబాయి

గన్నవరంరూరల్: మండలంలోని వీరపనేనిగూడెంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను శనివారం డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ గీతాబాయి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె గురుకుల పాఠశాలలోని డార్మిటరీ, చేతులు శుభ్రం చేసుకునే పరిసరాలు, మెస్, అకడమిక్ బ్లాక్, బాత్రూంలు పరిశీలించారు. భోజనశాలలో వంటకు సిద్ధం చేసిన ఆహార పదార్థాలు, కూరగాయలు పరిశీలించారు.

మెట్లపల్లిలో పర్యటన..

ఆత్కూరు పీహెచ్‌సీ పరిధిలోని మెట్లపల్లి గ్రామంలో చిన్న పిల్లల వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, ఫ్యామిలీ డాక్టర్స్ ప్రోగ్రాంను డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. చిన్న పిల్లలకు వేసే వ్యాక్సిన్ల పట్ల తల్లిదండ్రుల్లో అవగాహన పెంచాలని, వారికి జబ్బులు రాకుండా కాపాడేందుకు వ్యాక్సిన్‌లు సక్రమంగా వేయించాలని ఆదేశాలిచ్చారు. గర్భిణులు, బాలింతలు రిజిస్ట్రేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

విద్యుత్ ఈఈ కృష్ణనాయక్

ఉయ్యూరు: విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్ సూచించారు. స్థానిక డివిజనల్ కార్యాలయంలో విద్యుత్ బకాయిల వసూళ్లు, భద్రతా చర్యలు, ప్రమాదాల నివారణ తదితర అంశాలపై శనివారం సమీక్షించారు. ఈఈ కృష్ణనాయక్ మాట్లాడుతూ వినియోగదారులు సకాలంలో బకాయిలు చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలన్నారు. విద్యుత్ బిల్లులను మొబైల్ యాప్‌లలోనూ చెల్లించుకోవచ్చన్నారు. కరెంటు బిల్లు అందించిన 14 రోజుల్లోపు చెల్లించాలని, లేనిపక్షంలో అపరాధ రుసుముతో చెల్లించాల్సి ఉంటుందన్నారు. అధికారులు, సిబ్బంది బకాయిల వసూళ్లలో శ్రద్ధ చూపాలన్నారు. ప్రజలు విద్యుత్ పొదుపు చర్యలు పాటించాలన్నారు. ఏసీల వినియోగంలో జాగ్రత్తలు వహించాలన్నారు. పొలాలకు ఇనుప కంచెకు విద్యుత్ సరఫరా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలపై టోల్‌ఫ్రీ నంబరు 1912కి ఫోన్ చేసి సంప్రదించవచ్చని చెప్పారు.

ఆటోను ఢీకొట్టిన వ్యాన్



ధ్వంసమైన ట్రక్కు ఆటో

కంకిపాడు: ట్రక్కుఆటో, వ్యాన్ ఢీకొన్న సంఘటన విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై ప్రొద్దుటూరు అడ్డరోడ్డు వద్ద శనివారం తెల్లవారుజామున జరిగింది. ఈ ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాల మేరకు..ప్రొద్దుటూరు నుంచి కంకిపాడుకు కోడిగుడ్ల లోడుతో వెళ్తున్న ట్రక్కుఆటో ప్రొద్దుటూరు రోడ్డు నుంచి కంకిపాడు వైపు వెళ్తుండగా హైదరాబాద్ నుంచి వస్తున్న కోడి పిల్లల లోడు వ్యాన్ ఎదురుగా వచ్చి ఢీకొంది. దీంతో ఆటో పక్కనే ఉన్న పల్లపు ప్రదేశంలోకి పల్టీ కొట్టింది. ఆటో పూర్తిగా ధ్వంసమైంది. ఆటో నడుపుతున్న బి.వెంకటేశ్వరరరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని అంబులెన్సులో విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

ఎమ్మెల్యేకు వినతి

కైకలూరు: నివాస ప్రాంతాలను ఖాళీ చేయాలని నోటీసులు అందించారని, తమకు న్యాయం చేయాలని ముదినేపల్లి మండలం వడాలి గ్రామానికి చెందిన నివాసితులు కైకలూరులో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)కు శనివారం వినతిపత్రం అందించారు. వడాలిలో దేవదాయ ధర్మదాయశాఖ వీరికి నోటీసులు పంపింది. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ పూర్తి వివరాలు తెలుసుకుని సంబంధిత అధికారులతో చర్చిస్తానని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఈడే వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ పోలగాని నాగ రంగారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

పెనమలూరు: పోరంకిలో యువతి అదృశ్యంపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి వసంతనగర్‌లో వి.రత్నకుమారి తన ఇద్దరు పిల్లలతో ఉంటోంది. ఆమె ఇళ్లల్లో పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. అయితే ఆమెకు వేరే ప్రాంతంలో కాపలాదారు ఉద్యోగం రావటంతో అక్కడకు వెళ్లాలని నిర్ణయించుకుంది. ఈ నెల 7వ తేదీన కుమార్తె అనూష (19) ఇక్కడే ఉందామని కొత్త చోటకు రానని తల్లి రత్నకుమారితో గొడవ పడింది. ఆ తరువాత అనూష ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

కారు, లారీ ఢీ

పెనమలూరు: పోరంకిలో విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై వెళుతున్న కారును లారీ ఢీ కొట్టడంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకికి చెందిన బొప్పన రాజారావు శుక్రవారం తన కారులో పోరంకి నుంచి కంకిపాడు వైపునకు వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన లారీ డ్రైవర్ కనగాల రమేష్ ఢీ కొట్టాడు. ఈ ఘటనలో కారు వెనుక భాగం ధ్వంసమయింది. ఈ ఘటనపై కారు యజమాని రాజారావు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగ్గురు వ్యక్తుల దాడి

పెనమలూరు: పోరంకి శివాలయంలో పూజారి అయిలూరి పూర్ణ సుమంత్‌పై ముగ్గురు వ్యక్తులు దాడి చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. శివాలయంలో శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో మైక్ సౌండ్ తగ్గించాలని స్థానికంగా నివశిస్తున్న వంగూరు బ్రహ్మేశ్వరరావు, వంగూరు మురళి, వంగూరు సుబ్బారావు పూజారి పూర్ణ సుమంత్‌ను అడిగారు. దీనికి పూజారి సౌండ్ తగ్గిస్తానని చెప్పగా, ఆ సమయంలో వారి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పై ముగ్గురు వ్యక్తులు గొడవ పడి పూజారిపై దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన సీఐ రామారావు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.